క్లుప్తంగా...

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మల్కాజిగిరి: మల్కాజిగిరి కేంద్రం వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాల నిర్వాహకుడు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు, మహిళలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. డాక్టర్ రేఖారాణి, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, రమణాచారి, సునీల్‌యాదవ్ పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తాం



మచ్చబొల్లారంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్, అధికారులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లోని పలు కాలనీల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. బుధవారం విద్యుత్ అధికారుల బృందంతో కలిసి ఆయన మచ్చబొల్లారం డివిజన్‌లో పర్యటించారు. ఓవర్ లోడ్ కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో విద్యుత్ సమస్య ఏర్పడుతుండటంతో వాటి స్థానాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు సుచేంద్రనాథ్, చారీ, భరత్ తదితరులు ఉన్నారు.

రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాలి

మౌలాలి: డివిజన్ పరిధిలో రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాలని కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేశారు. బుధవారం జలమండలి ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్, పలువురు అధికారులతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. సాయినాథపురం ట్యాంకులో నుంచి నీరు సరఫరా అయ్యే కాలనీలకు నాలుగు, ఐదు రోజులకు ఒకసారి నీళ్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. సైనిక్‌పురి వాటర్ ట్యాంక్ నుంచి నీటి సరఫరా అన్ని ట్యాంకులకు సమానంగా వస్తోందన్నారు. మిగతా డివిజన్లలో రోజు విడిచి రోజు నీరు వస్తే మౌలాలి డివిజన్‌లోని కాలనీలకు నీటి సరఫరా తగ్గడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆమె కోరారు.

రంజాన్ కానుకల పంపిణీ

అల్వాల్: అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని రాజీవ్‌బస్తీలో బుధవారం ముస్లింలకు స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్‌తో కలిసి ఆయన రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అనిల్‌కిషోర్‌గౌడ్, స్థానిక నాయకులు మోసీన్ తదితరులు పాల్గొన్నారు.

చంపేస్తామంటున్నారు.. రక్షణ కల్పించండి

కాప్రా, కుషాయిగూడ: బంధువుల నుంచి ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి అంటూ చక్రిపురం కాలనీకి చెందిన గోరంటి శ్రీనివాస్ వేడుకుంటున్నాడు. ఈ మేరకు కాప్రా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తన ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్ నుంచి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి చక్రిపురంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. తనకు వివాహం కాకపోవడంతో ఒంటరిగా ఉంటున్న తన ఆస్తిని కాజేసేందుకు బావ వి.రవీందర్, అక్క శ్రీలక్ష్మీ, అల్లుడు మహేష్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో గతనెల 26న కొంతమంది కిరాయి రౌడీలను తన ఇంటిపైకి పంపి చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయగా నామమాత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారని వాపోయాడు. హత్యాయత్నం సెక్షన్లు నమోదు చేయలేదని, దీనిపై సీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నాం

గోరంటి శ్రీనివాస్ ఫిర్యాదుపై గతనెల 26న కేసు నమోదు చేశాం. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను బట్టి 448, 506, 34 ఐపీసీ సెక్షన్లు పెట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. దర్యాప్తులో లభించే ఆధారాలతో ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలో నిర్ణయిస్తామని అడ్మిన్ ఎస్‌ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

100 డేస్.. స్పెషల్ డ్రైవ్..

డివిజన్లకు ప్రత్యేక అధికారుల కేటాయింపు

- రోడ్లపై చెత్త వేస్తున్న 40శాతం మంది
- ఇంటింటికీ తిరిగి అధికారుల అవగాహన
- ప్రణాళికలపై నమ్మకం లేదంటున్న జనం
- అధికారుల అలసత్వమంటున్న మరికొందరు



హెచ్‌బీకాలనీలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎన్.శంకర్

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్‌లో 100 రోజుల ప్రణాళికలో భాగంగా స్పెషల్ డ్రైవ్ ప్రారంభమైంది. ఈ ప్రణాళికలో ముఖ్యంగా అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు ఈ స్పెషల్ డ్రైవ్‌తో అధికారులు ముందుకెళ్తున్నారు. సర్కిల్‌లోని కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, మీర్‌పేట్‌హెచ్‌బీకాలనీ, నాచారం, మల్లాపూర్ డివిజన్లకు ప్రత్యేక అధికారులను కేటాయించారు.

డివిజన్లకు కేటాయించిన ప్రత్యేక అధికారులు..

కాప్రా డివిజన్‌కు శ్రీధర్‌ప్రసాద్(టౌన్‌ప్లానింగ్ ఏసీపీ), ఏఎస్‌రావునగర్‌కు డాక్టర్ స్వప్నారెడ్డి(ఏఎంహెచ్‌ఓ), చర్లపల్లి డివిజన్‌కు భాస్కర్‌రావు(డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్), మీర్‌పేట్‌హెచ్‌బీకాలనీ డివిజన్‌కు నాగరాజు(శానిటరీ ఇన్‌స్పెక్టర్), మల్లాపూర్ డివిజన్‌కు రూప(డీఈఈ), నాచారం డివిజన్‌కు శ్రీనివాసులు(ప్రాజెక్టు ఆఫీసర్)ను కేటాయించారు. ఈ నోడల్ అధికారులు ప్రతిరోజూ ఆయా డివిజన్లలో తిరుగుతూ స్పెషల్ డ్రైవ్ పనులను పర్యవేక్షిస్తున్నారు.



అశోక్‌నగర్‌లో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న డాక్టర్ పద్మజ

స్వచ్ఛ ఆటోల ద్వారా 60శాతం చెత్త సేకరణ

కాప్రా సర్కిల్‌లో ఆరు డివిజన్లలో ప్రజలు 60 శాతం మంది మాత్రమే స్వచ్ఛ ఆటోల్లో చెత్త వేస్తున్నారు. మిగతా 40శాతం మంది మంది నివాసితులు ఎక్కడపడితే అక్కడ ఈ గార్బేజ్ పాయింట్లలో ఇష్టానుసారంగా వేసి వెళ్తున్నారు. ఇలా సర్కిల్ పరిధిలో మొత్తం 81 గార్బేజ్ వనరబుల్ పాయింట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ స్పెషల్ డ్రైవ్ ద్వారా అధికారులు ముందుకెళ్తున్నారు.

ఇంటింటికీ తిరిగి అవగాహన

పారిశుద్ధ్యం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అధికారులు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా స్వచ్ఛ ఆటోల్లో వేసి స్వచ్ఛ్ హైదరాబాద్ లక్ష్యానికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తతో పాటు, నిర్మాణ వ్యర్థాలు వంటివి గుర్తించి అక్కడి నుంచి తరలించనున్నారు. ఈ వంద రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం ప్రారంభమైన పనులను జీహెచ్‌ఎంసీ చీఫ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.శంకర్ పాల్గొని పారిశుద్ధ్య పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.

అధికారులపై నమ్మకం లేదు



అధికారులపై ప్రజలకు నమ్మకం లేకుండా పోతోంది. ఇలాంటి వంద రోజుల ప్రణాళికలు కేవలం చెప్పుకోవడానికే మిగిలిపోతున్నాయి. ప్రణాళికకు అనుగుణంగా చేసేది ఏమీ ఉండటం లేదు. గతంలో ఎన్నోసార్లు ఇలా స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టినా తిరిగి శరామామూలే అన్నట్లు ఉంది. ఇందుకు కారణం కొంతవరకు అధికారుల నిర్లక్ష్యం. కొందరు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణ ఏదో తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకోవడంతో స్వచ్ఛ్‌హైదరాబాద్ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు.

- పలుగుల మహేందర్, మారుతికాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు, చర్లపల్లి డివిజన్

అధికారుల అలసత్వం



రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోవడానికి అధికారుల అలసత్వం కూడా ఉంది. రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించి వినకుంటే జరిమానా వేస్తే తిరిగి అలాంటివి పునరావృతం కావు. ఇంటింటికీ చెత్త సేకరించే ఆటో నిర్వాహకులు క్రమం తప్పకుండా కాలనీల్లోకి వెళ్లడంలేదు. దీంతో చేసేదేమీలేక ప్రజలు ఇళ్లలో చెత్త పేరుకుపోవడంతో రోడ్లపై పడేస్తున్నారు. సరిపోనూ చెత్త ఆటోలు లేకపోవడం, స్వచ్ఛ ఆటో నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో స్వచ్ఛ్‌హైదరాబాద్ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నాం.

- నాగిరెడ్డి సంజీవరెడ్డి, కాప్రా కాలనీస్ కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు

దోమల స్వైరవిహారానికి చెక్ పెట్టండి



వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

మౌలాలి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో దోమల సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని బీజేవైఎం ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ నార్త్ జోన్ చీఫ్ ఎంటమాలజిస్ట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బీజేవైఎం మల్కాజిగిరి అసెంబ్లీ కో-కన్వీనర్ జిల్లెల భరత్‌యాదవ్ మాట్లాడుతూ.. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో సాయంత్రం దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీంతో ప్రజలు రోగాలతో ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. ప్రతి కాలనీలో 15 రోజులకు ఫాగింగ్ చేస్తున్నారని, రెండు రోజులకు ఒకసారి ఫాగింగ్ చేయాలన్నారు. బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ చంద్రకాంత్, జిల్లా అధికార ప్రతినిధి ఈసం రాకేష్, ఆకారం సాయిరాం, సాయిబాలాజీ తదితరులు ఉన్నారు.

దోమల సమస్యకు చెక్ పెట్టినందుకు సన్మానం

మల్లాపూర్: నాచారం డివిజన్ పటేల్‌కుంట చెరువు పక్కన ఉన్న మసీదు వద్ద దోమల సమస్య ఉందని కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆమె చెరువులోని గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించారు. మసీద్ కమిటీ సభ్యులు బుధవారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌ను సన్మానించారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జబ్బర్ సాహెబ్, ప్రధాన కార్యదర్శి తోఫిక్ సాహెబ్, ఆజామ్, జిలానీ, అక్రమ్, హాజీ, సమీర్, జునైద్, మౌజిన్ సాహెబ్, యూసుఫ్, అవైజ్, పర్వేజ్, అసద్, బీఆర్ఎస్ నాయకులు మేకల ముత్యంరెడ్డి పాల్గొన్నారు.



కార్పొరేటర్ శాంతిని సత్కరిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

బీజేపీతోనే బీసీలకు భరోసా



ఇంటింటికీ బీజేపీలో కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: డివిజన్ పరిధిలో బుధవారం నిర్వహించిన పల్లెపల్లెకు ఓబీసీ-ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పాల్గొని ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని బీసీలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ భరోసాగా నిలుస్తోందన్నారు. బీసీ విద్యార్థులకు నవోదయ కేంద్రీయ సైనిక విద్యాలయాల్లో రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్‌లతో పాటు వైద్య విద్యను అభ్యసించేందుకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వేముల తిరుపతయ్య, బీజేపీ నేతలు వెంకట్రావ్, నరసింహ, బాలకృష్ణ, అంజయ్య, నారాయణదాసు, కుమార్ పాల్గొన్నారు.

స్నాతకోత్సవం



గౌతంనగర్: విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని కృష్ణవేణి స్కూల్ డైరెక్టర్, కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు అన్నారు. బుధవారం మల్కాజిగిరి ముదిరాజ్ భవన్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూకేజీ, 5వ తరగతి పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. మంచాల శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉత్తేజం కలుగుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30వ రోజుకు హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర



పాదయాత్రలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి: హాథ్ సేథ్ జోడో పాదయాత్రలో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ చేపట్టిన పాదయాత్ర బుధవారం 30వ రోజుకు చేరింది. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ లెప్రసీ కాలనీ, ఉప్పరిగూడ, సంజయ్‌నగర్ కాలనీ, తాళ్లబస్తీలో పాదయాత్ర నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.500లకే గ్యాస్‌సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షలు, 80 గజాల ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, ఉమేష్‌సింగ్, శ్రీనివాస్‌గౌడ్, బి.కె.శ్రీను, గుత్తి రాంచందర్, సూర్యప్రకాష్, వేణు, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో కుమారుడితో పాటు స్నేహితుడి అరెస్టు



పవన్‌కుమార్



కుమారస్వామి

ఉప్పల్: తండ్రి రెండో పెళ్లి చేసుకుని తమను నిర్లక్ష్యం చేస్తున్నాడన్న కసితో సుత్తితో తండ్రి తలపై మోది దారుణంగా హత్య చేసిన ఘటనలో కుమారుడితో పాటు అతడికి సహకరించిన స్నేహితుడిని ఉప్పల్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. తండ్రి రెండో పెళ్లి చేసుకుని ఇంట్లో డబ్బులు ఇవ్వకుండా తమను నిర్లక్ష్యం చేస్తున్నాడన్న కోపంతో ఈ నెల 10వ తేదీన రామంతాపూర్ శ్రీనివాసపురం శ్రీరామ అపార్టుమెంట్‌లో తండ్రి సద్వాలా పాండుసాగర్(55)ను పెద్ద కుమారుడు సద్వాలా పవన్ కుమార్ సుత్తితో మోది దారుణంగా హత్య చేసిన విషయం విధితమే. ఈ ఘటనలో సీతాఫల్‌మండి ప్రాంతానికి చెందిన మృతుడి సోదరి వరాల సువర్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న పవన్ కుమార్‌తో పాటు అతడి స్నేహితుడు అన్నారపు కుమార స్వామి(32)ని బుధవారం రామంతాపూర్ విశాల్ మార్టు వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. తండ్రిని హత్య చేసిన కుమారుడు పవన్‌తో పాటు స్నేహితుడు కుమారస్వామి సహకరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు ఉపయోగించిన సుత్తి, రెండు సెల్‌ఫోన్లు, ఒక పల్సర్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పోటీ పరీక్షలతోనే విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు



రామంతాపూర్: రామంతాపూర్ శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన ఒలింపియాడ్ ప్రతిభ పరీక్షల్లో విజయం సాధించినందుకు బుధవారం స్కూల్ ఏజీఎం సతీష్ కుమార్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, సర్టిఫికెట్లు, బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలతోనే విద్యార్థుల్లోని ప్రతిభ బయటకు వస్తుందని అన్నారు. డీన్ సనంజీ, రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, శ్రీకీర్తి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన కాంట్రాక్టర్లు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వాణిరెడ్డిని బుధవారం కాంట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు కలిసి అభినందించారు. శాలువా కప్పి బొకే ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధిలో తమవంతు సహకారం అందజేస్తామన్నారు.

గాంధీ మార్గం ఆచరణీయం





మల్కాజిగిరి గాంధీ పార్కులో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, గీతానగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తూ..

మల్కాజిగిరి: గాంధీ మార్గం ఆచరణీయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మల్కాజిగిరి గాంధీ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. సత్యం, అహింస గాంధీ నమ్మే సిద్ధాంతాలని, వాటిని ఆచరించడం అందరికీ ఉపయోగకరం అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ ఎంచుకున్న సత్యాగ్రహం కీలకంగా మారిందన్నారు. గాంధీ పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, సునీతాయాదవ్, మీనారెడ్డి, నాయకులు జగదీష్‌గౌడ్, జీఎస్వీ సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్, రాముయాదవ్, నర్సింగరావు, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు షురూ..

ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ వసంతపురికాలనీలో రూ.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ప్రతి కాలనీలో యూజీడీ, తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కార్పొరేటర్ సునీతాయాదవ్, ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వీఐ రజనీకాంత్, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

అల్వాల్: పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం నేరేడ్‌మెట్‌లోని మధురానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఆయన వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ పుట్ట శ్రీనివాస్, డాక్టర్ ఎల్.కపూర్‌తో కలిసి ప్రారంభించారు. బస్తీ దవాఖానాలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

మౌలాలి: మౌలాలి డివిజన్ గీతానగర్ కాలనీలో రూ.20 లక్షల నిధులతో నిర్మించే రోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ మహేష్, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నాయకులు జీఎస్‌వీ.సతీష్‌కుమార్, గుండా నిరంజన్, సత్తయ్య, మోహన్‌రెడ్డి, సంతోష్ రాందాస్, సందీప్‌గౌడ్, దినేష్, బాలకృష్ణగుప్తా, కాలనీ అధ్యక్షులు కృష్ణమూర్తి, బాపూజీ, అమరేందర్, శంకర్‌రావు, మాణిక్యమాల తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అల్వాల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. హస్మత్‌పేట్‌కు చెందిన నల్లపల్లి చేతన్ (39) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. అతనికి 2011లో వివాహం జరగగా, 2018లో భార్య అతడిని విడిచి వెళ్లిపోయింది. చేతన్ తండ్రి రంగయ్య గత అక్టోబర్‌లో విదేశాలకు వెళ్లి బుధవారం తెల్లవారు జామున ఇంటికి తిరిగి వచ్చాడు. కాలింగ్ బెల్ కొట్టినా ఎంతకూ తలుపులు తెరవకపోవడంతో తమ వద్ద ఉన్న మారు తాళం చెవితో తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో కుళ్లిపోయిన స్థితిలో కుమారుడి మృతదేహం కనిపించింది. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఇల్లు విడిచి వెళ్లిపోవడం, తల్లి దండ్రులు విదేశాల్లో ఉండడంతో ఒంటరిగా ఉంటున్న చేతన్ మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంట్లో ఏసీ ఆన్‌లో ఉన్నందున దుర్వాసన బయటికి రాలేదని తెలిసింది. ఆత్మహత్య చేసుకున్నాడా ఇతర కారణాలు ఏమైన ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: ప్రధాన రహదారిలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద బుధవారం మధుర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాంగ్రెస్ రాష్ట్ర నేత రాగిడి లక్ష్మారెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో చలివేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

నేరేడ్‌మెట్ మూడుగుళ్ల వద్ద..

మల్కాజిగిరి: శ్రవణ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ మూడుగుళ్ల వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ శ్రవణ్, బీజేపీ సీనియర్ నాయకుడు రాంబాబు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మురళిగౌడ్, నందుయాదవ్, శ్రీకాంత్, సతీష్‌యాదవ్, సంతోష్, వేణు, కృష్ణ, రవి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

కుషాయిగూడ: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. బుధవారం చర్లపల్లిలోని మహమ్మదీయ మజీద్ ప్రభుత్వం అందజేసిన రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకొని, రంజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలన్నారు.